ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ **భూపాలపల్లి** **ములుగు**

శనివారం 27 జనవరి 2024

రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్(రామప్ప), జనవరి 26: ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో విద్యార్థులు, పర్యాటకులు పెద్ద ఎత్తున శుక్రవారం పెద్ద ఎత్తున సందర్శించారు. గణతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు రామప్పను సందర్శించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. గైడ్‌ల ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టత గురించి అడిగి తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



గౌరవ వందనం సమర్పిస్తున్న మహిళా పోలీసులు

పకడ్బందీగా పథకాల అమలు

- అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లిటౌన్, జనవరి 26: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి ప్రజలనుద్ధేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలోని 8లక్షల, 33వేల, 898 మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌక ర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం విలువ గతం లో రూ.5లక్షలు ఉండగా దానిని ప్రభుత్వం రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. విద్యాశాఖలో ఉత్తమ ఫలితాల కోసం ఉన్నతి, 'లక్ష్య' కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 241 గ్రామపంచాయ తీలలో 175లను ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. రోడ్లు, భవన నిర్మాణాల కోసం రూ.229కోట్లు వెచ్చించగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.62కోట్లు మంజూరు చేశామన్నారు.

జిల్లాలో నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 263 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రు లలో జరిగాయని తెలిపారు. 108 అంబులెన్స్‌ల ద్వారా 9,520 మందికి అత్యవసర సేవలు అందించినట్లు తెలిపారు. 102 అమ్మఒడి వాహనం ద్వారా 11,974 మంది గర్భిణీలకు, బాలింతలకు సేవలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మెరు గైన వైద్య సేవలు అందించడానికి తెలంగాణ డయాగ్నో స్టిక్ హబ్ ఏర్పాటు చేసి 43,524 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

రూ.117.09కోట్ల రైతు భరోసా చెల్లింపు..

పంట పెట్టుబడి సహాయం కింద ప్రభుత్వం జిల్లాలోని రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటివరకు రూ.117.09కోట్లు చెల్లించినట్లు తెలిపారు. దీనిని 1.15లక్షల మంది రైతులు అందుకున్నా రని తెలిపారు. రైతు భీమా పథకం కింద 137 కుటుంబాలకు రూ.6.85కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు లాభం కలుగుతుందని జిల్లాలో 943 ఎకరాలకు మంజూరుచేసి 315 మంది రైతులకు రాయితీ కల్పించడం జరిగిందని తెలిపారు.

జిల్లాలో 241 గ్రామ పంచాయతీలు ఉండగా 175 గ్రామ పంచాయతీలు ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలు గా తీర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సామాజిక భద్రతా పథకం ద్వారా దివ్యాంగులకు 4016, ఇతర పెన్షన్ దారులకు రూ.2016 చొప్పున నెలకు 57,754 మందికి రూ.13.53కోట్లు ఆసరా ఫించన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 2267 స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి కింద 12.50కోట్లు అందించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 14 ఎస్సీ, 19 ఎస్టీ, 9బీసీ, 2మైనార్టీ, మొత్తం 44 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3718 మంది పిల్లలు ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు.

భూపాలపల్లి మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా రూ.103.25కోట్లు వెచ్చించి 103 పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో 87 మహిళా సంఘాలకు రూ.7.26కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2020 నుంచి 2023 వరకు 151 అభివృద్ధి పనులకు గాను రూ.362.89లక్షలు మంజూరుకాగా ఇప్పటివరకు 118 పనులు చేపట్టి రూ.215.25లక్షలతో పూర్తిచేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా హెల్త్ సొసైటీ ఆరోగ్య నిధుల ద్వారా 13 హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ.3.80కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు 5 పూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న బాలిక

ములుగు సమగ్ర అభివృద్ధికి కృషి



ప్రసంగిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులు

- 75వ గణతంత్ర వేడుకల్లో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- తంగేడు స్టేడియంలో వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ములుగు కలెక్టరేట్, జనవరి 26: ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 75వ గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం ములుగులోని తంగేడు స్టేడియంలో కార్యక్రమం జరిగింది. ఎస్పీ శబరీశ్‌తో కలిసి పోలీసుల గౌరవ వందన స్వీకరించిన జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా ప్రజలనుద్ధేశించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సేవలను మరింత విస్తృతపరిచి రూ.10లక్షలవరకు ఉచిత వైద్యం పొందేలా తెచ్చిన పథకం ద్వారా 430మందికి 565రకాల వైద్యసేవలకుగాను రూ.86,370,921ల లబ్ధి చేకూర్చడం జరిగిందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రయాణ సౌలభ్యాన్ని కలిగిస్తుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువ సమస్యలు భూ సంబంధమైనవే రావడం ప్రభుత్వం గుర్తించిందని, అందుకే ధరణి పోర్టల్ స్థానంలో సమగ్ర భూ సమస్యల పరిష్కారం కోసం భూమాత పేరుతో పోర్టల్ తెస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. డిసెంబరు 28 నుంచి జనవరి 6వతేదీ వరకు జిల్లాలోని 174గ్రామపంచాయతీల్లో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం రెండు గ్రామసభలు నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 99,364 దరఖాస్తులు రాగా రశీదులు అందించామని తెలిపారు. రైతును బలోపేతం చేయడం ద్వారా పల్లెలు కళకళలడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో అత్యంత కఠిన వైఖరి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని, డ్రగ్స్‌భూతాన్ని రాష్ట్ర పొలిమేరలు దాటే వరకు తరిమికొట్టాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించిందని అన్నారు. సమగ్ర బాలల అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని 92మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌డేట్ చేసి మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించిందని అన్నారు. జిల్లాలో బాలికల కోసం బాలసదనం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి35లక్షలను మంజూరు చేసిందని అన్నారు. బాలింతలు, శిశువుల సౌకర్యం కోసం జిల్లా ఆస్పత్రిలో రూ.50వేలు వెచ్చించి ఏర్పాటుచేసిన బ్రెస్ట్ ఎక్ష్‌పషన్ యూనిట్‌ను మంత్రి ధనసరి సీతక్కతో ప్రారంభించుకున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో ఏర్పాటుచేసిన 164 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరపై ఎలాంటి తరుగు లేకుండా 86వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి రైతులకు రూ.80కోట్ల8లక్షలను చెల్లించడం జరిగిందని అన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిచెందిన సమ్మక్క-సారలమ్మ జాతరను తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్ల నిధులను మంజూరు చేసిందని, సుమారు కోటి 50లక్షలమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అదనంగా మరో రూ.30కోట్లను కేటాయించి అన్ని ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. జాతరను ప్లాస్టిక్ రహిత జాతరగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందని అన్నారు. కాగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు జాతీయ గీతాలకు అనుగుణంగా ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, వేణుగోపాల్, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో ప్రసూనరాణి, పలుశాఖల జిల్లా విభాగ అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

సమరయోధుల ఆశయాలను నెరవేర్చాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



ములుగులోని క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 26: బ్రిటిష్ వలస పాలకుల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రతీ ఒక్కరు పాటుపడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్న ప్రతీ పౌరుడు అమరులను స్మరించుకుంటూ దేశాభ్యున్నతిలో భాగస్వాములు కావాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పారదర్శకంగా పనిచేస్తోందని తెలిపారు. కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న సీతక్క త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో మంత్రి సీతక్క

సైబర్ నేరగాళ్ల చేతివాటం

యువకుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.86వేలు మాయం

కాటారం, జనవరి 26: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు విజృంభిస్తున్నారు. యువకుడి ఖాతా నుంచి అమెజాన్‌లో షాపింగ్ పేరిట రూ.86వేలు మాయం చేయడంతో అతడు లబోదిబోమంటూ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన సిద్ధం సాయికుమార్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను రెండు రోజుల క్రితం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. వాట్సాప్‌ను హ్యాక్ చేసి మెసేజ్‌లు పంపించారు. మెసేజ్‌లు పంపించిన కొద్దిసేపటికే సాయికు మార్ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ యాప్ నుంచి మొదటగా రూ.50వేలు, రెండు నిమిషాల వ్యవధిలో మరో రూ.36వేలు మాయం చేశారు. దీనిపై సైబర్‌క్రైమ్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సాయికుమార్ తెలిపారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

- విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి
- జెండా గద్దెపై పైపు అమర్చుతుండగా ప్రమాదం
- 11కేవీ విద్యుత్ లైన్‌కు తాకిన పైపు
- మరొకరికి తీవ్రగాయాలు



అంజిత్ మృతదేహం, అంజిత్(ఫైల్)



విజయ్ మృతదేహం, విజయ్(ఫైల్)

ములుగు, జనవరి 26: చెమటోడ్చితేనే కానీ పూట గడవని జీవితాలు ఆ యువకులవి.. రోజూవారి కూలీపనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.. దేశభక్తిని నరనరాన ఇనుమడించుకున్న వారు గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని శివాల యం(నగరేశ్వరస్వామి దేవాలయం) ఎదుట ప్రతీ ఏడు లాగే గణతంత్ర వేడుకలు జరిపేందుకు స్థానిక యువకులు ఏర్పాట్లు చేశారు. పరిసరాలలో భారతదేశ చిత్రపటాన్ని వేశారు. చుట్టూ తోరణాలు కట్టారు. ఉదయం 9.20గంటల సమయంలో జాతీయ జెండా కట్టిన ఇనుప పైపును గద్దెపై అమర్చే క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆ పైపును పట్టుకున్న ల్యాడ విజయ్, బోడ అంజిత్, బోడ కల్యాణ్ చక్రవర్తి షాక్‌కు గురై కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంజిత్(36) మృతి చెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్(25) కు సీపీఆర్ చేసిన వైద్యులు కాపాడే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికే ఆయన కూడా మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తికి ప్రథమ చికిత్స చేయడంతో కోలుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని కటుంబ సభ్యులు హనుమకొండకు తరలించారు. మృతులిద్దరూ నిరుపేద దళిత కుటుంబానికి చెందినవారు. అంజిత్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గృహనిర్మాణ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేసే అంజిత్ రోజువారి కూలీ డబ్బులతో భార్యా పిల్లలను పోషించుకుంటున్నాడు. అవివాహితుడైన విజయ్ స్థానికంగా ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద పనిచేస్తున్నారు. కొద్ది క్షణాల క్రితం వరకు తమ కళ్లెదుటే ఉన్న వారు విగత జీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు బోరున విలపించారు. కుటుంబ పెద్ద మరణించడంతో తాను, ముగ్గురు పిల్లలం అనాథలయ్యామని అంజిత్ భార్య లావణ్య రోధించింది. వృద్ధాప్యంలో ఉన్న తమను చూసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడంటూ విజయ్ తల్లిదండ్రులు లక్ష్మి-శంకర్ కన్నీరు పెట్టుకున్నారు. ఏరియా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.



తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : రాష్ట్ర మంత్రి సీతక్క

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రికి వచ్చి మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తక్షణ సాయంగా ప్రభుత్వం తర ఫున రూ.10వేల చొప్పున ఆర్థికసాయం, రూ.5లక్ష ల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలను అండగా ఉంటామన్నారు.

జోరుగా ముందస్తు మొక్కులు

- 2లక్షలకు పైగా భక్తజనం హాజరు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు
- పరిశీలించిన ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ



తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 26: తాడ్వాయి మండలం మేడారం వన దేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలకు మహా జాతర ఘనంగా జరగనుంది. ముందస్తుగా మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు తల్లుల గద్దెలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు ఆచరించారు. కళ్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మలకు జేజేలు పలుకుతూ క్యూలైన్ల ద్వారా గద్దెలకు చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకొని పూజలు చేశారు. తల్లి చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు

పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ

వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి శుక్రవారం 2 లక్షల మందికి పైగా భక్తులు మేడారం తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ములుగు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ మేడారంలో పర్యటించి సౌకర్యాలను పరిశీలించారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు కలిగే సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గద్దెల ప్రాంగణంలోని మంచెపై నుంచి దర్శనాలను పర్యవేక్షించారు.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

జిల్లా వైద్యాధికారిపై ఆగ్రహం

భక్తులకు వైద్యసేవలు అందించకుండా టీటీడీ కల్యాణ మండపంలోని వైద్య శిబిరం మూసి ఉండడంతో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్యకు ఫోన్‌చేసి కారణాలు అడిగారు. బుధ, గురు, ఆదివారాల్లో వైద్యసేవలు అందిస్తున్నామని డీఎంహెచ్‌వో సమాధానం చెప్పడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అధికంగా మేడారం వచ్చారని, వారికి ఉచిత వైద్య సేవలు వెంటనే కల్పించాలని ఆదేశించారు. అనంతరం గంట వ్యవధిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

జంట వంతెనలకు రైలింగ్ పనులు

మహాజాతరకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాల్లో భాగంగా జంపన్నవాగు జంట వంతెనలకు ఇరువైపులా రైలింగ్ పనులు అర్‌అండ్‌బీ శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. భక్తులు వాగులోకి తొంగి చూస్తూ పడిపోకుండా ఎత్తుగా నిర్మిస్తున్నారు.

మహాజాతరకు సకల ఏర్పాట్లు

- ఈ నెలాఖరులోగా పనులు పూర్తవుతాయి
- మేడారంలో మంత్రి సీతక్క
- పనుల పురోగతి పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశం



పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జనవరి 26: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం పర్యటించారు. ఆకస్మికంగా వచ్చి పనుల నాణ్యత ప్రమాణాలు, పురోగతిని తనిఖీ చేశారు. ఫిబ్రవరి 21 నుంచి జరిగే మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసింది. పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని తిరిగి పరిశీలించారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి.. పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. శాశ్వత, తాత్కాలిక ఏర్పాట్ల నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఈ నెలాఖరులో పూర్తిచేయాలని సూచించారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, రహదారుల నిర్మాణ పనులు, హరిత హోటల్ మరమ్మతులు, జంపన్నవాగు ఇసుక చదును, ఊటబావుల పూడికతీత, స్నానఘట్టాలపై బాతింగ్ గార్డ్స్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్తూరు సమీపంలోని తాత్కాలిక మరుగుదొడ్లు, స్థూపంరోడ్, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ దేవాలయం పరిసరాలు పరిశీలించారు. పూజారి కాక రంజిత్ దేవాలయ సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. వెంటనే అధికారులను మంత్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గుడుంబాను అడ్డుకుంటే కేసులు పెడతారా?

ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

హనుమకొండక్రైం, జనవరి 26: ఎక్సైజ్‌శాఖలో విధుల్లో భాగంగా తాము ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని గుడుంబాను నియంత్రించేందుకు కట్టుదిట్టం చేస్తే తమ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమసిబ్బందిపైనే పోలీసు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రొహిబిషన్ అండర్ ఎక్సైజ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. గీసుగొండ మండలం జాన్‌పాక గ్రామానికి చెందిన తేజావత్ బుజ్జి చేసిన ఆరోపణలపై శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తేజావత్ బుజ్జిపై దాడి చేసినట్టు చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. గుడుంబాను విక్రయించకూడదని హెచ్చరించినందుకు కక్షగట్టి తన ఇన్‌స్పెక్టర్ రమేష్‌చందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరైంది కాదని అన్నారు. దీనిపై పోలీసులు మరో మారు పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, చంద్రమోహన్, రమేష్‌చందర్, శశికుమారి పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజి కరకట్ట నిర్మించండి

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

మహదేవపూర్, జనవరి 26: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజి వెనక వైపుకు కరకట్ట నిర్మించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. శుక్రవారం చెన్నూరు నియోజక వర్గానికి సంబంధించిన రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజిని సందర్శించారు. బ్యారేజిని నిర్మించినప్పటి నుండి ఐదు సంవత్సరాలుగా తమ భూములు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజి వద్దకు చేరుకొని గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. బ్యారేజి వెనుకవైపుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి, అక్కడే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సి వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. తమ భూములు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే వివేక్ ఈఎన్‌సిని ప్రశ్నించగా తాము బ్యారేజి వెనకవైపుకు 5.7 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు ప్రపోజల్ పంపించామని, అయితే అప్పుడున్న ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పనులు మొదలుకాలేదని వివరించారు. దీనికోసం 132 కోట్లు అవసరమవుతాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాను సంబంధిత మంత్రితో, అధికారులతో మాట్లాడతానని, పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఈఎన్‌సికి సూచించారు.



మ్యాపు ద్వారా ఎమ్మెల్యే వివేక్‌కు వివరిస్తున్న ఈఎన్‌సీ



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు

నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తా..

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

సుబేదారి, జనవరి 26: నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తానని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పౌల్ట్రీ పితామహుడు స్వర్గీయ డాక్టర్ బీవీ రావు 28వ వర్ధంతిని హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీవీ రావు స్మారకార్థం కోడిగుడ్లను పంపిణీ చేశారు. నెక్ అభివృద్ధికి బీవీరావు ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రదీప్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్ దండ కరుణాకర్‌రెడ్డి, నెక్ జోనల్ కమిటీ మెంబర్లు టి. సుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.రమణారెడ్డి, కోశాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్పార్కిల్

హసన్‌పర్తి, జనవరి 26 : మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక సంబరం స్పార్కిల్-24 అలరించింది. ప్రముఖ సినీ గాయకుడు రామ్ మిరియాల పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు. చెమ్కీల అంగిలేసీ ఓ వదినే.., పొట్టిపిల్లా..పొట్టి పిల్లా.., ఓ మాయా మాయా ఓరి మాయారే.., చిట్టి నీన వ్వంటే లక్ష్మీ పటాసు..వంటి పాటలతో ఉర్రూతలూగించారు. మరో సినీ గాయని సింధూజ శ్రీనివాస్, పాడుతా తీయగా ఫేం శ్రీనివాస భరద్వాజల సినీ గీతాలతో ఉత్తేజపరిచారు. వీరి పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేస్తూ కళాశాల ప్రాంగణం అంతా దుమ్ములేపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం ద్రౌపది వస్త్రాభరణం ఆకట్టుకుంది. జానపద గీతాల నృత్యాలతో ఉత్సాహపరిచారు. అనంతరం యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి వివిధ ఈవెంట్లలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు జరిగిన స్పార్కిల్ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్లు రాజేశ్వర్‌రావు, వినూత్న, శ్రీకర్‌రెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న రామ్ మిర్యాల

బల్దియాలో గణతంత్ర వేడుకలు



గణతంత్ర వేడుకల్లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 26: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకల్లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాల గురించి రిజ్వాన్ తెలియచేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన బల్దియా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఇటీవలే బల్దియా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో..

హనుమకొండ క్రైం: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను వరంగల్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు పోలీసు స్టేషన్‌లు, ఎక్సైజ్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయంలో స్థానిక పోలీసు అధికారులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు స్వీట్లు పంచారు. తోటి సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని దేశభక్తిని చాటుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయం వద్ద సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని సిబ్బందితో కలిసి ఆలపించారు. అనంతరం సేవా, ఉత్కృష్ట పతకాలను పొందిన పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి పతకాలను సీపీ చేతుల మీదుగా అందించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవయ్యతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కేయూలో...

కేయూ క్యాంపస్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివేచన 19 వాల్యూ 1వ సంచికను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు.



కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాకు నమస్కరిస్తున్న సీపీ, పోలీసు అధికారులు



కేయూలో ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 26: మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.1.65లక్షల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. శాకరాసికుంటకు చెందిన ఎనగందుల రాజు కొంతకాలంగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి మూకుమ్మడిగా దాడులు చేసి అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజు పోలీసులను చూసి పరారయ్యాడు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు. పట్టుకున్న మద్యాన్ని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, జనవరి 26: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో 16 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒడిస్సాకు చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 16 కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



మృతుడు సురేష్ (ఫైల్)

నర్సింహులపేట, జనవరి26: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్ (25) నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట నుంచి ట్రాక్టర్‌లో మొరం సింగారానికి తరలిస్తుండగా, క్లచ్ విరిగిపోయింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పైకిలేచి డ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న నడికూడలోని రైతు వేదిక

ఉత్సవ విగ్రహాలుగా వేదికలు

● 18 నెలలుగా రాని నిర్వహణ నిధులు ● నిరుపయోగంగా రైతు వేదికలు ● అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్న వైనం
● కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం ● దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పునకు చర్యలు

"రైతు వేదికల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. కొత్త ప్రభుత్వం వీటిని ఏం చేస్తుందనేది కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వం వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ విషయంలో పట్టించుకోక పోవడంతో అవి అన్నీ నిరుపయోగంగా మారాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు ఇవ్వడం నిలిపివేయడంతో వాటి ఆలనాపాలనా చూసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దాదాపు 18 నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక పాట్లు పడుతున్నామని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా వీటిని పట్టించుకుంటుందని రైతులు భావించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు వేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం."

హనుమకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన రైతు వేదికలు నిరుపయోగంగా తయారయ్యాయి. ఈ భవనాల నిర్మాణం పూర్తయినా అధికారులు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. చాలాచోట్ల భవనాలకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. పలుచోట్ల మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదన్న సాకుతో వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో ఈ రైతు వేదికలపై దృష్టి సారించింది. వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి వీటిని రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. కానీ ఇంకా పూర్తిగా కార్యరూపం దాల్చలేదు.

ఆర్భాటంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఆరు జిల్లాలు - హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 515 రైతు వేదికలను నిర్మించారు. ఇందుకు రూ.113కోట్లను వెచ్చించారు. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.22 లక్షలను ఖర్చు చేశారు. ఈ మొత్తంలో రూ.10లక్షలను ఉపాధి హామీ పథకం నిధుల కింద సమకూర్చగా, మిగతా రూ.12లక్షలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. రైతు వేదికలలో ఏఈవో, రైతు వేదిక కోఆర్డినేటర్లకు ఒక్కొక్కటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రిసెప్షన్, రెండు మరుగుదొడ్లు నిర్మించేలా డిజైన్ చేశారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదిక తొలి భవనాన్ని జనగామ జిల్లా కొడకండ్లలో 2020 అక్టోబర్ 31న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అట్టహాసంగా ప్రారంభించారు.

నిర్వహణ భారం

రైతు వేదికల ప్రారంభ సమయంలో ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున విడుదల చేయడంతో నిర్వహణ సవ్యంగా సాగింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ రూ.9వేలలో పరిశుభ్రతో కోసం రూ.3వేలు, శిక్షణ ఖర్చుల కింద రూ.2,500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్‌చార్జీల కోసం రూ.వెయ్యి మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500 ఖర్చు చేసేవారు. అయితే గతంలో వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారు సైతం వేతనాలు ఇవ్వకపోవడంతో పనులకు రావడం లేదు. పలుచోట్ల ఏఈవోలే కొంత మొత్తాన్ని భరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. నిర్వహణకు నిధులు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

అసాంఘిక శక్తులకు అడ్డా..

రైతు వేదికల వద్ద భద్రత లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కనీసం కాపలాదారులు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సమావేశాల నిర్వహణ కోసం ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. భద్రత లేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతోందనని ఏఈవోలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ నెలా నిధులు కేటాయించడంతోపాటు కాపలాదారులను నియమించాల్సిన అవసరం ఉంది.

దృశ్య, శ్రవణ కేంద్రాలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో కొన్నిటిని వాడుకలోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎంపిక చేసిన కొన్ని వేదికలను వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలు తీర్చిదిద్దాలని భావించింది. ప్రయోగాత్మకంగా మొదట రాష్ట్రవ్యాప్తంగా 32 రైతు వేదికలను ఇందుకోసం ఎంపిక చేసింది. ఇందులో పరకాల వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న రైతు వేదిక ఒకటి. కానీ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనితో పలివేల్పులలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పలివేల్పులలో ఉన్న రైతు వేదికను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. పరకాల రైతు వేదికకు దృశ్య, శ్రవణ పరకరాలు మాత్రం వచ్చాయి. సంక్రాంతి పండుగ రోజున అంటే ఈనెల 15న ఈ కేంద్రాలకు ప్రారంభోత్సవం జరుగాల్సి ఉండింది. ఎందుకో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

మిగతా వాటి పరిస్థితి ఏమిటి?

కొన్నిటి రైతు వేదికలను మాత్రమే దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చితే మిగతావాటి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. తర్వాతకాలంలో వీటిని కూడా దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చుతుందా? లేక ఇంతటితోనే సరిపెట్టుకుంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతేనే మిగతా రైతు వేదికలను కొత్త ప్రభుత్వం పట్టించుకునేట్టు కనిపిస్తుంది. లేదంటే వాటి పరిస్థితి అయోమయమే. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు. సీజన్లలో రైతులకు పంటలపై తగిన శిక్షణ ఇవ్వడానికి వీలుగా కనీసం నిర్వహణ ఖర్చులైన ఇవ్వాలని వారు కోరుతున్నారు. రైతు వేదికల్లో కనీసం ఒక స్వీపరును, వాచ్‌మెన్ అయినా నియమించాలని కోరుతున్నారు. లేకుంటే అవి క్రమంగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోని వస్తువులు దొంగలపాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



కాలిన గాయాలతో సతీష్

యజమాని తిట్టాడని ఆత్మహత్యాయత్నం

మేడారం, జనవరి 26: యజమాని తిట్టాడని పెట్రోల్ పోసుకొని యువకుడు నిప్పంటించుకున్న ఘటన తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతల గద్దెల ముఖద్వారం ఎదుట శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఊరుగొండకు చెందిన మేడిపల్లి సతీష్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా వరంగల్ జిల్లా కరీమాబాద్‌లోని ఆర్ముఖ బార్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం మేడారం వనదేవతల దర్శనానికి బార్ యజమాని, సతీష్‌తో పాటుగా సహ పనివారిని తీసుకువచ్చారు. వనదేవతల దర్శనం అనంతరం భోజనాల సమయంలో యజమాని మందలించడంతో సమ్మక్క సారలమ్మల దేవస్థానం ప్రధాన ద్వారం ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలు ఆర్పి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సతీష్ శరీరం 80 శాతం కాలిపోయిందని డాక్టర్లు తెలిపారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పాఠశాల బస్సు



డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 26: ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని రామాంజాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రానికి చెందిన నారాయణ హైస్కూల్‌కు చెందిన బస్సు 20మంది విద్యార్థులను ఎక్కించుకుని మండలకేంద్రం వైపు ప్రయాణమైంది. ఈక్రమంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో రామాంజాపూర్‌కు చేరుకోగానే అదుపుతప్పి సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టబోయి ఆగిపోయింది. డ్రైవర్ మద్యంమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈసంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పీవో అంకిత్

గిరిజనుల అభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

గణతంత్ర దినోత్సవంలో ప్రాజెక్టు అధికారి అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 26: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంతో ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీడీఏ జరిగిన వేడుకల్లో ఐటీడీఏ పీవో పాల్గొని పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలను సకాలంలో అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు పీవో తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, 21శాఖల ద్వారా రూ. 75కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పీవో తెలిపారు.

విద్యా విభాగం

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మొత్తం 25,572 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశామని, రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నామని పీవో తెలిపారు.

వైద్య విభాగం

ఐటీడీఏ పరిధిలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆస్పత్రులు, 22ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 122 ఉప ఆరోగ్య కేంద్రాలున్నాయని, వానాకాలంలో దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశమున్నా 174 ఏజెన్సీ గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో దోమ తెరల పంపిణీతోపాటు దోమల మందును పిచికారి చేసి రోగాలను అరికట్టామన్నారు. ఎంసీహెచ్ ఎపిడమిక్ స్కీం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి డిసెంబరు 2023 వరకు 1473 మెడికల్ క్యాంపులు నిర్వహించి 69,492 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీవో తెలిపారు. మూడు ఉచిత అంబులెన్స్ పథకం ద్వారా ఇప్పటి వరకు 3,973మందికి ఉచితంగా వైద్యసేవలందించమన్నారు. 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి న్యూట్రీషన్‌కిట్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఇంజనీరింగ్ విభాగం

ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టిక్ 275 కింద గిరిజన భవనాలు, బీటీ రోడ్లు, పాఠశాలల మరమ్మతులకు రూ.528.44 కోట్లు నిధులు కేటాయించగా ఇందులో 1,055 పనులు పూర్తయ్యాయని, 104పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు. అదేవిధంగా ఐటీడీఏపరిధిలో 117 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలకుగాను రూ.500కోట్లు మంజూరు చేశామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 44సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలకు రూ.704లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇందులో 35పనులు పూర్తి కాగా 3పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు.

ట్రైకార్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు 2020-21, 2022 సంవత్సరానికిగాను 6,761 యూనిట్ల సబ్సిడీ మంజూరు అయ్యాయని, వాటిని మండలాల వారీగా విభజించి మండల అభివృద్ధి అధికారులకు పంపించి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఇప్పటివరకు 3,318 యూనిట్లు మంజూరు చేశామన్నారు. సబ్సిడీ డబ్బులు త్వరలో విడుదల చేయనున్నట్లు పీవో వెల్లడించారు. అదేవిధంగా ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3 ఇటుకల తయారీ యూనిట్లు, 4సెంట్రింగ్ యూనిట్లు, 4 కాంక్రీట్ మిక్స్, ఫుడ్ ట్రాక్ యూనిట్లు గిరిజనులకు మంజూరు చేశామని పీవో తెలిపారు.

గిరిజన మత్స్య పారిశ్రామిక

గిరిజన రైతులకు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సొసైటీలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 15 ఏజెన్సీ మండలాల్లో 814 చెరువులు ఉండగా 101 సొసైటీల రిజిస్ట్రేషన్ జరిగిందని, సొసైటీలకు రూ.కోటి70లక్షల 88వేల చేపపిల్లలను అందించామన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ద్వారా 7చేపల చెరువులు నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని, 3యూనిట్లకుగాను రూ.14.8లక్షల సబ్సిడీని గిరిజనులకు విడుదల చేశామన్నారు. అదేవిధంగా గిరిజన మత్స్యకారులకు 37 బైక్‌లు, 2 ఆటోలను మంజూరు చేశామన్నారు.

గిరి వికాసం

గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతుల పొలాల్లో నీటి వసతుల కల్పన కోసం గిరి వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇందుకోసం గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, ఇప్పటివరకు 3,018 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. దీనికిగాను రూ.954.98లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అదేవిధంగా గిరిజన సహాయనిధి పథకం కింద 476 మందికి రూ.51.17లక్షల నిధులను అందజేశామన్నారు. గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తోందని పీవో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని పీవో పిలుపునిచ్చారు. కాగా, ఐటీడీఏలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదరస్వామి, ఎస్ వో రాజ్ కుమార్, డీడీ పోచం, ఈఈ హేమలత, మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగలో ప్రొటోకాల్ రగడ

● బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట ● పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ
● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఎగురవేసిన హైస్కూల్ హెచ్‌ఎం



జెండా కర్రను గుంజుకుంటున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జనవరి 26 : జాతీయ జెండాను ఎగురవేసేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రోటోకాల్ రగడ శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా వద్ద గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేసేందుకు జెండా కమిటీ నిర్వాహకులు ఎంపీపీ అంజయ్యను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మాత్రమే జెండా ఆవిష్కరణ చేయాలని, బీఆర్‌ఎస్ నాయకులు చేయవద్దని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన జెండాను తొలగించి కర్రను ఒకరికొకరు గుంజుకోవడం చేశారు. జాతీయ జెండా ఏర్పాటు కోసం నిర్వహణ కమిటీ రూ.20 లక్షల నిధులతో ఫెన్సింగ్, గార్డెనింగ్, సీసీకెమెరాల ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశామని, మేమే జెండా ఎగురవేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ అధికారులే జెండా ఆవిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న జెండా వేడుకలకు అధికారులు ఎమ్మెల్యేను, ఇతర ప్రభుత్వ అధికారులను పిలవకుండా ప్రోటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వంద అడుగుల జెండాను ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తుంటే ప్రజా ప్రతినిధులను, అధికారులను పిలవాల్సిన అవసరం లేదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను హెచ్చరించారు. జెండా ఎగురవేయకుండా ఆపడం సరికాదని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జెల్ల లక్ష్మీనారాయణతో జెండా ఆవిష్కరణ చేపట్టారు. సంఘటనా స్థలానికి సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్, ఆర్డీవో నర్సింహ రావు, ఇతర అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ఒకే ప్రాంగణంలో రెండు జెండాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గణతంత్ర దినోత్సవ వేడుకల జెండా ఆవిష్కరించారు. అదే పాఠశాల ఆవరణలో ఉన్న వంద అడుగుల జాతీయ జెండా వద్ద ఏర్పాటు చేసిన మరో జెండాను కూడా హెచ్‌ఎం లక్ష్మీ నారాయణ ఆవిష్కరించారు. ఒకే ప్రాంగణంలో రెండు జెండాల ఆవిష్కరణపై హెచ్‌ఎం లక్ష్మీ నారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరించానని తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవిందర్‌రావు

డీసీసీబీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హనుమకొండలోని డీసీసీబీ హెడ్ ఆఫీస్‌లో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మార్నేని రవిందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, రవిరాజ, నరేందర్, సీఈవో ఎండి.వజీర్ సుల్తాన్, డీజీఎం కురువ నాయక్, ఏజీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీ చేతుల మీదుగా ఉత్కృష్ట సేవాపతకాన్ని స్వీకరిస్తున్న రమేష్

ఒంటేరు రమేష్‌కు ఉత్కృష్ట సేవాపతకం

సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా స్వీకరణ

హనుమకొండ క్రైం, జనవరి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి)లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒంటేరు రమేష్‌కు పోలీసు శాఖలో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఉత్కృష్ట సేవా పతకం లభించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినకాలంలో స్థానిక ప్రజలకు విశేష సేవలను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేసిందుకు కాగాను ఉత్కృష్ట సేవా పతకం లభించింది. శుక్రవారం వరంగల్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ల చేతుల మీదుగా పతకాన్ని స్వీకరించారు. తనకు ఉత్కృష్ట సేవాపతకం రావడం చాలా ఆనందంగా ఉందని, తన సేవలను గుర్తించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు రమేష్ తెలిపారు. రమేష్‌కు ఎస్‌బీ విభాగం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్

రాష్ట్రస్థాయి ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

హనుమకొండ అర్బన్, జనవరి 26: ఔషధ నియంత్రణ శాఖ హనుమకొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవార్డును కిరణ్ కుమార్ అందుకున్నారు. విధి నిర్వహణలో కచ్చితత్వమే అవార్డు తెచ్చిపెట్టిందని పలువురు కెమిస్టులు ప్రశంసించారు.



అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

జైలు సిబ్బందికి అవార్డులు

హనుమకొండ రూరల్, జనవరి 26: వరంగల్ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. కేంద్ర కారాగార డీజీ సౌమ్యామిశ్రా వారికి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో పరావస్తు వెంకటేశ్వరస్వామికి ఎక్సలెన్స్ సర్వీస్ కింద రూ.5వేల క్యాష్ రివార్డు, డిప్యూటీ జైలర్ శెంకేసి వెంకటేశ్వర్లు ఔట్‌స్టాండింగ్ ఫెర్మామెన్స్ కింద, హెడ్‌వార్డర్ మెట్టు చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ టి.ప్రతిభారాణి అందుకున్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


వాజేడులో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్


గోవిందరావుపేటలో వందనం చేస్తున్న తహసీల్దార్ సృజన్‌కుమార్


ఏటూరునాగారంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కుమార్


వెంకటాపురం రామప్ప పోలీస్‌స్టేషన్‌లో..

ములుగు జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

ఏటూరునాగారం, జనవరి 26 : మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలల్లో, పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జీసీసీ కార్యాలయంలో డివిజనల్ మేనేజర్ జి. ప్రతాప్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుమార్, గ్రామపంచాయితీ కార్యాలయంలో కార్యదర్శి రమాదేవి, తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎంఈవో, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో హేమలత, అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్‌డీవో అనుజ్ అగర్వాల్, ఎక్సైజ్ శాఖ సీఐ ఫక్కిరా, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్న, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం. భగవద్గీత, సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ సురేష్ కుమార్, బస్టాండ్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ప్రెస్‌క్లబ్ భవననిర్మాణ స్థలంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్, కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో చిటమట రఘు, బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సత్యంజెండాలను ఆవిష్కరించారు.

● గోవిందరావుపేట : మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గణతంత్ర వేడుకలు శుక్రవారం జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, జీపీ కార్యాలయంలో కార్యదర్శి దేగల శంకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఈవో దివాకర్‌లు పతాకాన్ని ఎగురవేశారు.

● కన్నాయిగూడెం : మండలంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సలీం, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సురేష్ జాతీయ జెండాలను ఆవిష్క రించారు. అనంతరం విద్యార్థులకు నోటు బుక్స్ పెన్నులను బహూకరించారు.

● వాజేడు : మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ జాతీయ జెండా ఎగురవేశారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, వాజేడు పీహెచ్‌సీలో డాక్టరు కొమరం మహేందర్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయ, పీఏసీఎస్‌లో సీఈవో సత్యనారయణ, వాజేడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లు, పేరూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గొర్ల రమేష్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ శారద, జడ్పీటీసీ తల్లడి పుష్పలత, ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు, డాక్టరు మధుకర్, డీటీ రాహుల్‌చంద్ర వర్మ, ఆర్ఐ రాజు, హెచ్ఎస్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

● తాడ్వాయి : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, గ్రామపంచాయతీలో సర్పంచ్ ఇర్ప సునీల్, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్‌లో చైర్మన్ పులి సంపత్, వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారి జైసింగ్, ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం పద్మ, ఇందిరా నగర్ జడ్పీహెచ్ఎస్‌లో నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, కాటాపూర్, బీరెల్లి, రంగాపూర్, లింగాల, దామెరవాయిలో గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి గణతంత్ర దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించి మిఠాయిలు అందజేశారు.

● వెంకటాపురం(నూగూరు): మండలవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు శుక్రవారంజరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్వర్‌పాషా, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అడ్డూరి బాబు, సొసైటీ కార్యాలయంలో సెక్రటరీ సత్యనారాయణ, ఐసీడీఎస్‌లో సీడీపీవో శిరీష, మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. కాగా, మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేల్పూరి లక్ష్మీనారాయణలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

● వెంకటాపూర్(రామప్ప), జనవరి 26: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చల్ల రాజు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ అశోక్, పీఏసీఎస్‌లో చైర్మన్ కాసర్ల కుమార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాధిక, మైనారిటీ కళాశాలలో ప్రిన్సిపాల్ వందన, కేజీబీవీలో ఎస్‌వో సరిత, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపా ల్ శ్రీధర్‌గౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చందర్, ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ రవీందర్, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ శ్రీనివాస్, వెన్నెల మండల సమాఖ్య భవనంలో ఏపీవో రవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

భూపాలపల్లి జిల్లాలో సంబరాలు

కాకతీయఖని, జనవరి 26: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు హజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏరియా ఉత్తమ సింగరేణి ఉద్యోగులకు బహుమతులను ప్రధానం చేశారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జిల్లా అటవీ శాఖ అధికారి వసంత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎఫ్‌డీవో కృష్ణప్రసాద్, ఎఫ్ఆర్‌వోలు నరేష్ బస్వ పాల్గొన్నారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో అధికారులు జెండా విష్కరించారు. పదవీ విరమణ పొందనున్న కండక్టర్ సీహెచ్ ఎల్ రెడ్డితో కలిసి డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు

● చిట్యాల : మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ సుమన్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, ఎంఈవో కోడెపాక రఘుపతి, సీఐ వేణుచందర్, ఏఎంసీ చైర్మన్ కొడారి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, ఏపీఎం మంజుల, పలు పార్టీల అధ్యక్షుడు గూట్ల తిరుపతి. ఆరెపెల్లి మల్లయ్య బుర్ర వెంకటేష్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులుజెండాను ఎగురవేశారు.

● మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీత, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ నాగరాణి, ఐకేపీ కార్యాలయంలో రవివర్మ, ఎంజేపీ బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్‌లో చైర్మన్ నర్సింగరావు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మాధవ్‌గౌడ్, పశువైద్యశాలలో డాక్టర్ శ్రీరామ్, కేజీబీవీలో ప్రత్యేక అధికారిణి శైలజ, మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ హైమావతి, ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో వార్డెన్‌లు వర్ధన్ అరుణ, శ్రీనివాస్ జెండా వందనం చేశారు.

● రేగొండ : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రవికుమార్, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ విజ్జన్‌రావు, ప్రాథమిక ఆోగ్య కేంద్రంలో వైద్యాధికారి హిమబిందు, జీపీ కార్యాలయాల్లో పంచాయితీ కార్యదర్శులు జెండా ఎగురవేశారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నర్సింహమూర్తి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎమ్మార్ క్యాంపు కార్యాలయంలో వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి రాజు, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మెన్ రామారావు, కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నరేష్, ఐకేపీలో ఏపీఎం కమల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వివిధ కుల సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఏగిరేశారు.

● మహాముత్తారం : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపి, గ్రామపంచాయతీ, హైస్కూల్, పీఏసీఎస్, పోలీస్ స్టేషన్, టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెల వద్ద జాతీయ జెండాను ఎగుర వేశారు. అదేవిధంగా మండలంలోని 24 గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద జాతీయ జెండాను ఎగరు వేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఎంపీపీ సుభద్ర, జడ్పీటీసీ లింగమల్ల శారద. పీఏపీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీ ల్దార్ మంజుల, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుధాకర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనిత అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జాతీయ జేండాను ఆవిష్కరించారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలోని పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, మండల పరిషత్ వద్ద ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నాగరాజు, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ ప్రశాంతి, పీఏసీఎస్ వద్ద వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, మండల సమాఖ్యలో ఏపీఎం లవకుమార్, రైతు వేదిక లో ఏవో రామకృష్ణ, పీహెచ్‌సీలో డాక్టర్ మౌనిక, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యాలయాల్లో ఆయా పార్టీల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, రామిళ్ల కిరణ్, బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● గణపురం : గణపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్ రావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సాంబమూర్తి, ఎంపీడీవో కార్యాలంలో ఎంపీడీవో అరుందతి, కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో సీఈ సిద్ధయ్య, చెల్పూరు పీఏసీఎల్ కార్యాలయంలో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


మహదేవపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఈఈ యాదగిరి


స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో ఉన్న చిన్నారులతో డీఎస్పీ



మల్హర్ తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగిరేస్తున్న తహసీల్దార్


టేకుమట్ల తహసీల్దార్ కార్యాలయంలో..

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి

- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే..

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 26: దేశంలో ఉన్న వివిధ రకాల మతాలు, కులాలు, జాతులను ఒకే తాటిపైకి ఉంచుతూ దేశ సమగ్ర తను కాపాడుతున్న రాజ్యాంగాన్ని అందరు గౌరవించాలని జిల్లా జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో భారత గణతంత్ర దినోత్స వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణం మంజూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి మువ్వన్నెల తివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జీ నారాయణబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరిండెంట్ శ్రీనివాస్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రాములు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో రమాదేవి, జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మీ, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వై. శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో అనిల్‌కుమార్ జాతీయ పతాకాల్ని ఎగరవేశారు.


జెండావందనం సమర్పిస్తున్న భూపాలపల్లి జిల్లా ఎస్పీ

భూపాలపల్లి కలెక్టరేట్ : గణతంత్రవేడుకలు సమీకృత కలెక్టరేట్ లో జరిగాయి. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసులు గౌరవవందనం స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు పాల్గొన్నారు.

పేదలందరికీ ఆరు గ్యారెంటీలు.. : ఎమ్మెల్యే గండ్ర


పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, జనవరి 26: అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు తప్పకుండా అందేలా చూస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. శుక్రవారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి ఘనంగా గణతంత్ర వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అలాంటి పార్టీ ఎప్పటికీ పేదల పక్షాన ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు నిజమైన న్యాయం జరుగుతుందని తెలిపారు. అదే నిజమైన స్వాతంత్ర్యం అని అన్నారు. ఎమ్మెల్యేగా తాను కూడా అవినీతికి తావులేని పాలనను అందిస్తానని అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

లక్ష్మీదేవర మహా జాతర ప్రారంభం


జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కాటారం, జనవరి 26: మండలంలోని ప్రతాపగిరి సమీపంలోని అటవీప్రాంతంలో గల గొంతెమ్మ గుట్టపై జాతర నిర్వహణ కమిటీ, ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లక్ష్మీదేవర మహాజాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమయింది. మొదటి రోజున ప్రతాపగిరికి చెందిన లక్ష్మీదేవరను నిర్వాహకులు పుణ్య స్నానం చేయించిన అనంతరం గొంతెమ్మగుట్ట కింద, పైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర కోసం ప్రతాపగిరి గ్రామంలో, గొంతెమ్మగుట్టపై గల పాండవ భేరిల వద్ద పచ్చని పందిళ్ల వేశారు. గుట్ట ప్రధాన ద్వారం వద్ద గల మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవరతో విన్యాసాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహా జాతర నిర్వహణ కమిటీ నేతలు మేకల సంతోష్, గుంటి రాజేందర్, మేకల పోచం, కిష్టయ్య, చిన్న కిష్టయ్య, మధునయ్య, పోచయ్య, రవీందర్, వెంకటయ్య, రాజం, సంతోష్, సురేందర్, కిట్టు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు

ఏటూరునాగారం, జనవరి 26 : మండల కేంద్రంలోని ఐటీడీఏ పీవో గెస్ట్ హౌస్ మూల మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో రెండు ఇసుక లారీలు చెడిపోయాయి. వెంకటాపురం(నూగూరు) మండలం నుంచి ఏటూరునాగారం మీదుగా హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీలు ఏటూరునాగారం వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. దీంతో మూడు గంటల పాటు వచ్చిపోయే ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలకు అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక

ములుగు కలెక్టరేట్, జనవరి 26: సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్, జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ములుగు జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి జయదేవ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్‌ఫెయిర్‌లో ములుగు జిల్లా నుంచి రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని అందులో ఒకటి జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్లు తెలిపారు. గ్రూప్ ప్రాజెక్టు కింద మైథిలి, రక్షితలు ప్రదర్శించిన ఏఐటెస్ట్ ఇంటెలిజెంట్ ఆల్కహాల్ డిటెక్షన్ అలారం సిస్టం ఫర్ డ్రైవర్స్ ప్రాజెక్టు ఎంపికైందని, సింగిల్ ప్రాజెక్టు కింద బి.మనీష్ ప్రదర్శించిన వాయిస్ యాక్టివేటెడ్ హాయ్ అండ్‌లో హార్ట్‌బీట్ అండ్ పల్స్ ట్రాకింగ్ సిస్టం ఎంపికైందని అన్నారు. ఈనెల 28నుంచి ఫిబ్రవరి 1 వరకు విజయవాడలో జరిగే సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనకు హాజరుకానున్నారని అన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

ములుగు కలెక్టరేట్, జనవరి 26: ములుగు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన కిచెన్‌సెట్స్, రగ్గులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని దొడ్ల, మల్యాల గ్రామాలకు చెందిన 50కుటుంబాలకు కిచెన్‌సెట్స్, రగ్గులు, దోమతెరలు పంపిణీ చేశారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అప్పయ్య, స్టేట్ కమిటీ సభ్యుడు కొత్తపల్లి ప్రసాదరావు, వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలి

ఏటూరునాగారం, జనవరి 26 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాలని ములుగు జిల్లా టీఎన్‌జీవోఎస్ యూనియన్ సెక్రెటరీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోలు రాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని టీఎన్‌జీవోఎస్ యూనియన్, తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

పాలంపేట జీపీలో తనిఖీలు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 26: మండలంలోని పాలంపేట గ్రామపంచాయతీ నిధులు సర్పంచ్‌తోపాటు కొందరు అధికారులు కుమ్మక్కై స్వాహా చేసినట్లు అధికారుల ప్రాథమిక తనిఖీల్లో వెల్లడైంది. డీఎల్‌పీవో స్వరూపరాణి శుక్రవారం పాలంపేట జీపీకి సాధారణత్వానికి నిమిత్తం వచ్చారు. ప్రాథమికంగా ఎంబీ రికార్డులు, జమా, ఖర్చుల వివరాలకు సంబంధించిన రికార్డులను ఇవ్వమని స్థానిక కార్యదర్శి శ్రీతేజను ఆదేశించారు. తనవద్ద ఎలాంటి రికార్డులు లేవని, కొత్తగా వచ్చానని సమాధానం ఇవ్వడంతో డీఎల్‌పీవో ఒక్కసారిగా ఖంగుతి న్నారు. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం ప్రాథమిక తనిఖీ చేయగా రూ.కోటి స్వాహా అయినట్లు అంచనాకు వచ్చారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. మూడురోజుల్లో రికార్డులను అందుబాటులో ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులు వీరే

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లాలో ఉత్తమ సేవలందించి ఉద్యోగులకు భూపాలపల్లి, ములుగు జిల్లా కలెక్టర్లు భవేష్‌మిశ్రా, ఇలా త్రిపాఠిల చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసా పత్రాలను అందించారు. ఉత్తమ ఉద్యోగులకు ఎంపిక చేసి ఆయా జిల్లా కేంద్రాల్లో కల్లో ప్రశంసా పత్రాలు అందజేశారు


కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా ప త్రం తీసుకుంటున్న శ్రావణ్‌కుమార్


రాఘవేందర్


సంజీవరావు


శైలజ


తిరుపతి


మల్హార్ నాయక్


శ్రీనివాస్


వెంకటేశ్వర్‌రావు


రాజ్ ప్రకాశ్


శంకర్


కమలాకర్


శివశ్రీ సాయిరామ్


అల్లెం అప్పయ్య


అజిత్


పి.విజేందర్